పేదరికం లేని సమాజం కోసమే గ్రామాభివృద్ధి ప్రణాళిక

ప్రజాశక్తి - అత్తిలి

పేదరికం లేని సమాజ నిర్మాణమే గ్రామాభివృద్ధి ప్రణాళిక లక్ష్యమని జెడ్‌పిటిసి సభ్యురాలు అడ్డాల జానకీదేవి తెలిపారు. ఎంపిడిఒ కార్యాలయంలో మంగళవారం గ్రామాభివృద్ధి ప్రణాళిక, సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై పురోగతి ప్రణాళిక రూపకల్పనకు సచివాలయ సిబ్బందికి మూడు రోజుల శిక్షణ తరగతులు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా టిఒటిలు జి.శ్రీనివాస్, రాజకుమార్ సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులకు ఆయా అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపిపి నక్కా సూర్యారావు, జెడ్‌పి కోఆప్షన్ సభ్యులు మహ్మద్ అబీవుద్దీన్, వైస్ ఎంపిపి సుందర నాగేశ్వరరావు, శిరీషా, ఎంపిడిఒ వివిఎస్.రామారావు, ఇఒపిఆర్‌డి ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సిట్టింగుల్లో టెన్షన్..!

- ఎంఎల్ఎల పని తీరుపై 16న సిఎం జగన్ సమీక్ష
- 'గడపగడప'కూ కార్యక్రమం అమలే ప్రధాన అంశం
- పనితీరు సరిగా లేకపోతే టిక్కెట్టుకు ఎసరంటూ ఇప్పటికే హెచ్చరికలు
- జిల్లాలో ఐదారుగురుపై అధిష్టానం అసంతృప్తి
- మరోసారి గట్టిగా హెచ్చరించే అవకాశం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

అధికారపక్షం వైసిపికి చెందిన సిట్టింగ్ ఎంఎల్ఎల్లో టెన్షన్ నెలకొంది. వచ్చే ఎన్నికల్లో టిక్కెట్టుపై ఇప్పటి నుంచే ఆందోళన చెందుతున్నట్లు తెలుస్తోంది. ఎంఎల్ఎల పని తీరుపై ఈ నెల 16న ఆ పార్టీ అధినాయకుడు జగన్ సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు. సమావేశంలో ప్రధానంగా 'గడపగడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమం సాగిన తీరుపైనే ప్రధానంగా చర్చ సాగే అవకాశం ఉంది. గత సమీక్షా సమావేశాల్లోనూ ఇదే ప్రధాన అంశంగా సాగింది. అప్పట్లో గడపగడపకూ సరిగ్గా తిరగని ఎంఎల్ఎలను, మంత్రులను, మాజీ మంత్రులను సైతం జగన్ హెచ్చరించారు. పని తీరు మెరుగుపరచుకోకపోతే వచ్చే ఎన్నికల్లో టిక్కెట్ ఇవ్వడం సాధ్యం కాదని తీవ్రంగా హెచ్చరించిన దాఖలాలున్నాయి. ఈసారి జరిగే సమీక్షా సమావేశంలోనూ సరిగ్గా పనితీరు కనబరచని ఎంఎల్ఎలను మరోసారి గట్టిగా మందలించే పరిస్థితి ఉందని తెలుస్తోంది. ఎన్నికలకు ఏడాదిన్నర మాత్రమే గడువు ఉండటంతో ఎన్నికల వ్యూహాలపై వైసిపి అధిష్టానం దృష్టి సారించింది. రెండు జిల్లాల్లోనూ 14 అసెంబ్లీ స్థానాలు ఉండగా 12 చోట్ల వైసిపి ఎంఎల్ఎలే ఉన్నారు. పాలకొల్లు, ఉండిలో మాత్రం టిడిపి ఎంఎల్ఎలు ఉన్నారు. వచ్చే ఎన్నికల్లో 175 స్థానాల్లోనూ వైసిపి గెలవాలనే నినాదంతో వైసిపి అధిష్టానం ముందుకు సాగుతోంది. దీంతో ప్రతి నియోజకవర్గంపైనా ఇప్పటి నుంచే దృష్టి సారించింది. ప్రజల్లో తిరగని, గ్రూపు తగాదాలతో వికటించి తెప్పిస్తున్న ప్రజాప్రతినిధులపైనా జగన్ దృష్టి సారించినట్లు తెలుస్తోంది. చాలామంది ఎంఎల్ఎలు 'గడపగడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని తూతూమంత్రంగా సాగిస్తున్నట్లు అధినాయకత్వం భావిస్తోంది. చింతలపూడితోపాటు పలు నియోజకవర్గాల్లో గ్రూపు తగాదాలు కొనసాగుతుండటంపైనా వైసిపి అధిష్టానం సీరియస్‌గా ఉన్నట్లు చర్చ సాగుతోంది. ఇలాంటి సమస్యలను ఇప్పటి నుంచే పరిష్కరించకపోతే రాబోయే ఎన్నికల్లో ఇబ్బందులు తప్పవని అంచనాతో ముందుగానే ఎంఎల్ఎలను గాడిన పెట్టేందుకు జగన్ ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. రెండు జిల్లాల్లోనూ 14 నియోజకవర్గాలు ఉండగా ఐదారు నియోజకవర్గాల్లో 'గడపగడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమం సరిగా సాగడం లేదనే భావన అధిష్టానం దృష్టిలో ఉన్నట్లు చెబుతున్నారు. ఆ నియోజకవర్గాలు ఏమిటనే దానిపై సమావేశంలో చర్చకు వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇప్పటికిప్పుడు చెప్పకపోయినా వచ్చే ఎన్నికల్లో ఐదారు అసెంబ్లీ నియోజకవర్గాల్లో అభ్యర్థుల మార్పు తథ్యమనే ప్రచారం సాగుతోంది. ఇప్పుడే ప్రకటిస్తే ఇబ్బందికర పరిస్థితులు నెలకొనే అవకాశం ఉండటంతో ప్రస్తుత హెచ్చరికలతో సరిపెట్టే అవకాశం ఉందని తెలుస్తోంది. దీనిలో తాజా, మాజీ మంత్రుల స్థానాలు కూడా ఉన్నట్లు చర్చ నడుస్తోంది. 'గడపగడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమం సక్రమంగా నిర్వహించి ప్రభుత్వం అందిస్తున్న పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తే వచ్చే ఎన్నికల్లో గెలుపు తథ్యమని వైసిపి భావిస్తోంది. దీంతో ఈ కార్యక్రమం సరిగా అమలు చేయని ఎంఎల్ఎలపై ప్రధానంగా దృష్టి సారిస్తోంది. సిటింగుల్లో ఎంతమందికి టిక్కెట్ దక్కుతుందోననే చర్చ ఇప్పటికే వైసిపిలో నడుస్తోంది. ప్రస్తుతం ఎవరి సీటుకూ ఇబ్బంది లేదని చెబుతున్నప్పటికీ ఇప్పటికే అధిష్టానం దృష్టిలో పలువురు

ఎంఎల్ఎలపై అసంతృప్తి ఉన్నట్లు తెలుస్తోంది. ఎంఎల్ఎలు సైతం అధిష్టానం మెప్పు కోసం గడపగడపకూ కార్యక్రమం సమర్ధవంతంగా నిర్వహించేందుకు ప్రయత్నం చేస్తున్నారు. ఏదేమైనా వచ్చే ఎన్నికల్లో రెండు జిల్లాల్లోనూ దాదాపుగా సగం స్థానాల్లో కొత్త అభ్యర్థులు వచ్చే అవకాశం ఉందనే అంచనాలు మాత్రం సాగుతున్నాయి. ఆశావహులు సైతం ఇప్పటి నుంచే టిక్కెట్ కోసం పైస్థాయిలో పావులు కదుపుతున్నట్లు ప్రచారం సాగుతోంది. రెండు రోజుల్లో జరగబోయే సమీక్షా సమావేశంలో పలు నియోజకవర్గాల ఎంఎల్ఎల పనితీరుపై జగన్ చేసే హెచ్చరికలతో కొంత స్పష్టత వచ్చే అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. వచ్చే మార్చి వరకూ గడపగడపకూ కార్యక్రమం ఉండటంతో సిట్టింగు ఎంఎల్ఎల పనితీరులో మార్పునకు అవకాశం ఉందనే చర్చ కూడా సాగుతోంది.

పెన్షన్ రూ.250 పెంపు

రూ.2,750కు చేరిన పెన్షన్ మొత్తం

రెండు జిల్లాల్లో 4.83 లక్షల మందికి లబ్ధి

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఎన్నికల హామీ మేరకు సామాజిక పెన్షన్లకు సంబంధించి మరో రూ.250 పెంచుతూ రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించింది. వచ్చే జనవరి ఒకటో తేదీ నుంచి పెరిగిన పెన్షన్ లబ్ధిదారులు అందుకోనున్నారు. దీంతో ప్రస్తుతం రూ.2500 అందుకున్న పెన్షన్ మొత్తం రూ.2,750కు చేరనుంది. మంగళవారం జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో పెన్షన్ పెంపునకు ఆమోదం తెలిపారు. 2019 ఎన్నికల నాటికి సామాజిక పెన్షన్ రూ.రెండు వేలుగా ఉంది. వైసిపి అధికారంలోకొస్తే పెన్షన్ రూ.మూడు వేలకు పెంచుతామని వైసిపి ప్రకటించింది. ఎన్నికల్లో గెలిచాక ప్రమాణ స్వీకారం రోజున రూ.250 పెంచుతున్నట్లు ప్రకటిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఆ తర్వాత రెండేళ్లకు మరో రూ.250 పెంచడంతో రూ.2,500కు చేరింది. ఇప్పుడు మరో రూ.250 పెంపుతో రూ.2,750కు పెన్షన్ మొత్తం చేరనుంది. పెన్షన్ పెంపుతో ఏలూరు జిల్లాలో 2.65 లక్షల

మంది, పశ్చిమగోదావరి జిల్లాలో 2.18 లక్షల మంది పెన్షన్‌దారులు లబ్ధి పొందనున్నారు.

రైతులతో మాట్లాడుతున్న ఆర్‌డిఒ దాసిరాజు

తేమ అధికంగా ఉన్నా ధాన్యం కొనుగోలు

ఆర్‌డిఒ దాసిరాజు

ప్రజాశక్తి - వీరవాసరం

ధాన్యంలో తేమ శాతం అధికంగా ఉందని రైతులు ఆందోళన చెందనవసరం లేదని, తేమ అధికంగా ఉన్నా ధాన్యం కొనుగోలు చేస్తామని భీమవరం ఆర్‌డిఒ దాసి రాజు తెలిపారు. మంగళవారం ఆయన వీరవాసరంలో పర్యటించి పొలాల వద్ద రైతులను కలిసి ధాన్యం అమ్మకంలో ఎదురవుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. రైతులకు ధాన్యం అమ్మకాల్లో ఎటువంటి ఇబ్బందీ లేకుండా ప్రభుత్వం తీసుకున్న చర్యలు వివరించారు. ధాన్యం అమ్మిన 21 రోజుల వ్యవధిలో రైతులకు డబ్బు చెల్లించడం జరుగుతుందన్నారు. మండలంలో తేమ శాతం 22 వరకు ఉన్నా ధాన్యం తీసుకునేందుకు మిల్లర్లు ముందుకొచ్చారన్నారు. మండలంలో దాదాపు అన్ని మిల్లులకు డ్రయ్యర్లు ఉండటం వల్ల తేమ శాతం అధికంగా ఉన్నా వారు రైతుల నుండి ధాన్యం తీసుకుంటున్నారని తెలిపారు. అధిక తేమ శాతం ఉందని మిల్లర్లు వచ్చిన ధాన్యాన్ని వెనక్కు పంపితే ఆయా మిల్లర్లపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా రైతులు ధాన్యం అమ్మకాల్లో ఎదురవుతున్న కొన్ని ఇబ్బందులను ఆర్‌డిఒ దృష్టికి తీసుకొచ్చారు. ధాన్యం తూకంలో హెచ్చు తగ్గులతో ఇబ్బంది పడుతున్నామన్నారు. ఒక రైతుకు చెందిన ఒకే భూమి రెండు వేర్వేరు ఆర్‌బికెల పరిధిలోకి వెళ్లడంతో సాంకేతికంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. సర్వర్లు డౌన్ కావడంతో మిల్లు వద్ద గంటల కొద్దీ వేచి ఉండాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆర్‌డిఒ దాసి రాజు తెలిపారు. ఆయన వెంట తహశీల్దార్ సుందర్రాజు, ఎంపిడిఒ, మండల వ్యవసాయాధికారి గీతాదేవి, ఆర్ఐ సురేష్, వైసిపి నాయకులు గూడూరి ఓంకారం, కోటిపల్లి బాబు, సర్పంచి శ్రీనివాసరావు ఉన్నారు.

ఉన్నత విద్యకు ప్రాధాన్యత

రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ పోలా భాస్కర్

ప్రజాశక్తి - పాలకొల్లు

గ్రాడ్యుయేషన్ డేలో పాల్గొన్న పి.భాస్కర్

రాష్ట్ర ప్రభుత్వం ఉన్నత విద్యకు అధిక ప్రాధాన్యతిస్తోందని రాష్ట్ర విద్యా శాఖ కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్ చెప్పారు. స్థానిక ఎఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ అటనామస్ కాలేజీలో మంగళవారం తొలిసారి 150 మంది విద్యార్థులకు గ్రాడ్యుయేట్ సర్టిఫికెట్లను ఆయన అందించారు. యూనివర్సిటీల్లో జరిగే గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాన్ని తొలిసారి నిర్వహించడం పట్ల విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే మరపురాని ఘట్టమని అన్నారు. ఈ కార్యక్రమంలో అతిథిగా నన్నయ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఎం.జగన్నాథరావు, విద్యా శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ డేవిడ్‌కుమార్‌స్వామి, డాక్టర్ బాబ్జీ, ప్రిన్సిపల్ డాక్టర్ రాజరాజేశ్వరి, డాక్టర్ బివి.రాఘవులు, నిమ్మకాయల రామకృష్ణ, సిహెచ్.కృష్ణ పాల్గొన్నారు.

ఉద్యోగిని విధుల్లోకి తీసుకోవాలని విద్యార్థుల ఆందోళన

ప్రజాశక్తి - పాలకొల్లు

స్థానిక ఎఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇటీవల అకారణంగా తొలగించిన తాత్కాలిక దళిత ఉద్యోగిని తొలగించిన ప్రిన్సిపల్ డాక్టర్ రాజరాజేశ్వరిని బర్తరఫ్ చేయాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యాన విద్యార్థులు మంగళవారం ఆందోళన చేపట్టారు. తొలుత మార్కెట్ యార్డు నుంచి కళాశాల వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కళాశాలలోకి వెళ్లేందుకు యత్నించగా పట్టణ సిఐ షేక్ అఖిల్ జమ సారథ్యంలో పోలీసులు విద్యార్థులను లోపలికి వెళ్లకుండా అడ్డుకున్నారు. దీంతో ఉద్రిక్తత ఏర్పడింది. సుమారు రెండు గంటల చర్చల అనంతరం తాత్కాలిక ఉద్యోగిని తిరిగి విధుల్లోకి తీసుకునేందుకు ప్రిన్సిపల్ అంగీకరించడంతో విద్యార్థులు ఆందోళన విరమించారు.

విద్యార్థుల ఆందోళన

విద్యార్థులు కొత్త ఆవిష్కరణలు చేయాలి

నన్నయ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఎం.జగన్నాథరావు

ప్రజాశక్తి - పాలకొల్లు

సెంటర్‌ను పరిశీలిస్తున్న జగన్నాథరావు

విద్యార్థులు సాధారణ పుస్తకాలను చదవడమే కాకుండా కొత్తకొత్త విషయాలు ఆవిష్కరించడంపై దృష్టి సారించాలని నన్నయ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఎం.జగన్నాథరావు కోరారు. మంగళవారం పట్టణంలోని ఛాంబర్ కళాశాలలో లెర్నింగ్ సెల్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం అధ్యాపకులు, విద్యార్థులనుద్దేశించి జగన్నాథరావు మాట్లాడుతూ కళాశాల నాక్ గుర్తింపునకు వెళ్లేలా కృషి చేయాలని సూచించారు. కమ్యూనికేషన్ స్కిల్స్ పెంచుకుని సరికొత్త ఆవిష్కరణలు చేసినప్పుడే విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకుంటారని జగన్నాథరావు అన్నారు. బోధనా సిబ్బంది కూడా కొత్త పద్ధతుల్లో విద్యాబోధన సాగించాలని సూచించారు. సమావేశంలో ఛాంబర్ కళాశాల ఛైర్మన్ కారుమూరి నరసింహారావు, సెక్రటరీ కలిదిండి రామరాజు, ప్రిన్సిపల్ డాక్టర్ వెంకటేశ్వరరావు, ప్రముఖులు డాక్టర్ మూర్తి, ఓల్గా, దేవరపు లక్ష్మీనారాయణ, తటవర్తి కృష్ణమూర్తి, ఇనుకొండ రంగారావు పాల్గొన్నారు.

సృజనాత్మకత వెలికితీతకే సైన్స్‌ఫెయిర్

ప్రజాశక్తి - ఉండి

ప్రదర్శనను పరిశీలిస్తున్న శ్యామ్‌ప్రసాద్

విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించడానికి సైన్స్ ఫెయిర్‌లు దోహదపడతాయని జిల్లా సైన్స్ ఫెయిర్ అధికారి శ్యామ్‌ప్రసాద్ అన్నారు. మండల స్థాయి సైన్స్ ఫెయిర్‌ను ఎన్ఆర్‌పి అగ్రహారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు ముక్కు వెంకట సత్యనారాయణ అధ్యక్షతన ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథి శ్యామ్ ప్రసాద్, గ్రామ సర్పంచి సూరవరపు కనకదుర్గ వెంకటాచార్యులు, ఎంపిటిసి మున్నలూరి సువర్ణలక్ష్మి శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సైన్స్ పట్ల ప్రతిఒక్క విద్యార్థీ అవగాహనను పెంచుకోవాలని ఆయన కోరారు. ఈ ప్రదర్శనలో పర్యావరణహిత పదార్థాలు, ఆరోగ్యం పరిశుభ్రత, సాఫ్ట్‌వేర్, యాప్‌ల తయారీ, గణిత మోడలింగ్, పర్యావరణ వాతావరణ మార్పులకు సంబంధించి ప్రాజెక్టు రూపంలో ప్రదర్శన నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి న్యాయనిర్ణేతలుగా సాయిరాం, చక్రవర్తి, బేబీ రాణి, రవీంద్ర తదితరులు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రుల కమిటీ ఛైర్మన్ బి.నాగలక్ష్మి పాల్గొన్నారు.

'పారిశ్రామికాభివృద్ధికి అవకాశాలు-అవరోధాలు'పై

నేడు సదస్సు

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో 'పారిశ్రామికాభివృద్ధికి అవకాశాలు-అవరోధాలు' అనే అంశంపై సిఐటియు ఆధ్వర్యంలో ఈ నెల 14న బుధవారం యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో నిర్వహించే జిల్లాస్థాయి సదస్సును జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బి.వాసుదేవరావు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక సిఐటియు జిల్లా కార్యాలయంలో సదస్సు సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వాసుదేవరావు మాట్లాడుతూ జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధికి అనేక అవకాశాలున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాల వల అభివృద్ధి కుంటుపడుతుందని విమర్శించారు. పారిశ్రామికాభివృద్ధి నిరుద్యోగానికి పరిష్కారం చూపగలవన్నారు. నూతన జిల్లా రాష్ట్రంలోనే పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న జిల్లాల్లో అగ్రభాగాన ఉందన్నారు. రాష్ట్రంలో ఆర్థిక రాజధానిగా ఉన్న జిల్లాను మరింత పారిశ్రామికంగా అభివృద్ధి చేయడంలో పాలకవర్గాలు విఫలమవుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. సిఐటియు 16వ రాష్ట్ర మహాసభను భీమవరంలో జనవరి 2, 3, 4 తేదీల్లో ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా నిర్వహించే సదస్సుకు ముఖ్యవక్తగా ప్రముఖ విద్యావేత్త, పిడిఎఫ్ ఎంఎల్‌సి కెఎస్.లక్ష్మణరావు హాజరవుతున్నారని చెప్పారు.



పెనుమంట్ర: భీమవరంలో జనవరి 2, 3, 4 తేదీల్లో జరిగే సిఐటియు 16వ రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని ఆ సంఘం మండల కార్యదర్శి కె.ప్రసాద్ పిలుపునిచ్చారు. పెనుమంట్రలో మంగళవారం కరపత్రాలు పంపిణీ చేసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ జిల్లా కేంద్రం భీమవరంలో సిఐటియు రాష్ట్ర మహాసభ జరగనుందన్నారు. నిరంతరం ఉద్యోగ, కార్మికుల సమస్యలపై పని చేస్తున్న సిఐటియు రాష్ట్ర మహాసభకు రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల నుండి వెయ్యి మంది నాయకులు ప్రతినిధులుగా హాజరవుతారని తెలిపారు. రెండో తేదీన నిర్వహించే ప్రదర్శన, బహిరంగ సభలో పెద్దసంఖ్యలో కార్మికులు పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో జి.సత్తిబాబు, డిడి గవరయ్య, జి.శ్రీను, మణికంఠ, టిఎస్.రాజు, కనికిరెడ్డి పాల్గొన్నారు.

బీచ్‌లో తాత్కాలిక దుకాణాలు ఏర్పాటు చేసుకోవచ్చు : చీఫ్ విప్ ప్రసాదరాజు

ప్రజాశక్తి - మొగల్తూరు

సముద్ర తీరంలో తాత్కాలికంగా దుకాణాలు ఏర్పాటు చేసుకుని తమ వ్యాపారాలు కొనసాగించుకోవచ్చునని చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు తెలిపారు. ఇటీవల కెపిపాలెం బీచ్‌లో ఏర్పాటు చేసిన శాశ్వత కట్టడాలను అధికారులు తొలగించారు. దీంతో ఆప్రాంతంలోని వ్యాపారులు సుమారు 100 మంది వైసిపి నాయకుడు పోతుల రమేష్ ఆధ్వర్యంలో మంగళవారం నరసాపురంలోని ఎంఎల్‌ఎ కార్యాలయంలో ప్రసాదరాజును కలిసారు. తమకు ఎటువంటి ముందస్తు సమాచారం అందించకుండా దుకాణాలను కూల్చి వేయడంతో ఆర్థికంగా నష్టపోవడంతోపాటు జీవనోపాధి కోల్పోయామని వాపోయారు. దీనిపై స్పందించిన ప్రసాదరాజు మాట్లాడుతూ కోర్టు ఉత్తర్వుల మేరకు అధికారులు శాశ్వత కట్టడాలను కూల్చివేశారన్నారు. తాత్కాలిక షెడ్లు ఏర్పాటు చేసుకుని వ్యాపారాలు చేసుకోవచ్చన్నారు. ఆయనను కలిసిన వారిలో కారుమంచి ఆనంద్, కడలి కృష్ణ, పి.సత్తిబాబు, కె.జలంధరి, పుచ్చకాయల సంజీవరావు, తెన్నేటి సత్యనారాయణ, పలువురు దుకాణదారులు ఉన్నారు.



దుకాణదారులతో మాట్లాడుతున్న ప్రసాదరాజు

నిధుల సమీకరణలో పారిశ్రామికవేత్తలు తోడ్పాటునివ్వాలి

ఇన్‌ఛార్జి డిఆర్‌ఒ దాసిరాజు

ప్రజాశక్తి - భీమవరం

కార్పొరేట్, సామాజిక బాధ్యత (సిఎస్‌ఆర్) నిధుల సమీకరణలో పారిశ్రామికవేత్తలు తోడ్పాటునివ్వాలని ఇన్‌ఛార్జి జిల్లా రెవెన్యూ అధికారి దాసిరాజు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో సిఎస్‌ఆర్ నిధుల సేకరణపై పారిశ్రామికవేత్తలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దాసిరాజు మాట్లాడుతూ పారిశ్రామికవేత్తలు సిఎస్‌ఆర్ ఫండ్స్ అందజేయడం ద్వారా జిల్లా అభివృద్ధికి భాగస్వాములు కావాలని కోరారు. కొత్త జిల్లా భీమవరం కేంద్రంగా ఏర్పడిన నాటి నుండి జిల్లా అభివృద్ధికి యంత్రాంగం నిరంతరం కృషి చేస్తుందన్నారు. దీనిలో భాగంగా ఇప్పటికే జిల్లాలో రోడ్ల విస్తరణ, ఆక్రమణల తొలగింపు, నగర సుందరీకరణ పనులు, జిల్లా కలెక్టరేట్ అభివృద్ధి పనులను చేపట్టామన్నారు. జిల్లా ప్రజల సామాజిక బాధ్యత, అవసరాల నిమిత్తం ఎక్కువ మొత్తంలో టర్నోవర్ ఉన్న పరిశ్రమలు, ఓఎన్‌జిసి, ఇతర కార్పొరేషన్ల నుండి వార్షిక ఆదాయంలో రెండు శాతం సిఎస్‌ఆర్‌ఫండ్స్ కు కేటాయించాల్సి ఉందన్నారు.

మాట్లాడుతున్న దాసి రాజు

పిఎం టిబి ముక్తభారత్ అభియాన్ ద్వారా టిబి రోగులను ఆదుకోవాలి

జిల్లాలో సుమారు 2,300 మంది టిబి వ్యాధిగ్రస్తులు ఉన్నారని, వారికి ప్రభుత్వం వైద్యం, మందులను ఉచితంగా అందజేయడంతో పాటు ప్రతినెలా రూ.500 పౌష్టికాహారానికి చెల్లిస్తున్నారని ఇన్‌ఛార్జి డిఆర్‌ఒ దాసి రాజు తెలిపారు. టిబి వ్యాధిగ్రస్తులు సాధ్యమైనంత ఎక్కువ పౌష్టికాహారం తీసుకుంటేనే త్వరగా కోలుకోగలరన్నారు. వారి ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ఇప్పటికే జిల్లా కలెక్టర్‌తో సహా జిల్లా అధికారులు 110 మంది టిబి వ్యాధిగ్రస్తుల పోషణ నిమిత్తం ఆర్థిక సహాయాన్ని అందజేశారన్నారు. 10 మంది బాధితులకు పౌష్టికాహారం అందించే బాధ్యతగా ఆంధ్రా సుగర్స్ యాజమాన్యం రూ.42 వేలు అందజేసిందన్నారు.

భీమవరంలో రెడ్‌క్రాస్ రక్తనిధి ఏర్పాటుకు చర్యలు

భీమవరం కేంద్రంగా జిల్లా ఏర్పడిన అనంతరం రక్తనిధి ఏర్పాటుకు జిల్లా కలెక్టర్ కృషితో సాధించుకోగలిగామని దాసి రాజు తెలిపారు. ఇప్పటికే రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో బ్లడ్ బ్యాంక్ ఏర్పాటుకు ఉచితంగా భవనాన్ని జిల్లా యంత్రాంగం కేటాయించిందన్నారు. సేకరించిన రక్తాన్ని నిల్వ ఉంచేందుకు అవసరమైన యంత్ర సామగ్రిని రూ.1.20 కోట్లతో ఇప్పటికే కొనుగోలు చేసి సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. బ్లడ్ బ్యాంక్ నిర్వహణకు సెంట్రలైజ్డ్ ఎసి తదితర మౌలిక వసతుల ఏర్పాటుకు మరో రూ.30 లక్షలు అవసరం ఉందని తెలిపారు. ఈ మొత్తాన్ని దాతలు ముందుకొచ్చి సమకూరిస్తే బ్లడ్‌బ్యాంక్‌ను త్వరలో ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి వీలవుతుందని తెలిపారు. ఈ సమావేశంలో కమిటీ మెంబర్ కన్వీనర్, చీఫ్ ప్లానింగ్ అధికారి కె.శ్రీనివాసరావు, సభ్యులు జిల్లా పరిశ్రమ శాఖ అధికారి వి.ఆదిశేషు, కార్మిక శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఎ.లక్ష్మి, డిఎంహెచ్ఒ డి.మహేశ్వరరావు, జిల్లా రెడ్‌క్రాస్ ఛైర్మన్ డాక్టర్ బద్రిరాజు, వివిధ సంస్థల ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

ఎంఎల్‌సి ఐవిచే మోడల్ టెస్టు పేపర్ల ఆవిష్కరణ

ప్రజాశక్తి - మొగల్తూరు

ఎస్ఎస్‌సి మోడల్ టెస్టు పేపర్లను పిడిఎఫ్ ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు (ఐవి) మంగళవారం ఆవిష్కరించారు. ఆయన మండలంలోని ముత్యాలపల్లి గ్రామంలో బండి ముత్యాలమ్మ జెడ్‌పి ఉన్నత పాఠశాలను మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.బాలనాగమణి, సిబ్బంది ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పాఠశాల సిబ్బందితో ఐవి మాట్లాడారు. గత మూడున్నర సంవత్సరాల నుంచి ప్రభుత్వం ఉద్యోగులకు వ్యతిరేకంగా అమలు చేస్తున్న విధానాలను గుర్తు చేశారు. రాబోయే రోజుల్లో ఉద్యోగులందరూ చైతన్యవంతులై పోరాటానికి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నేతలు చింతపల్లి కృష్ణమోహన్, కె.బ్రహ్మయ్య, సూర్యప్రకాష్, ఎస్‌టియు నేతలు కృష్ణంరాజు, బళ్ల శ్రీనివాస్, మోక శ్రీనివాస్ పాల్గొన్నారు.

టెస్టు పేపర్లను ఆవిష్కరిస్తున్న ఎంఎల్‌సి ఐవి, ఉపాధ్యాయ నేతలు

స్విమ్మింగ్ పోటీల్లో పెర్కిపాలెం విద్యార్థిని ప్రతిభ

ప్రజాశక్తి - వీరవాసరం

ఈ నెల 11వ తేదీన ఏలూరులో నిర్వహించిన ఈత పోటీల్లో మండలంలోని పెర్కిపాలేనికి చెందిన కోరశిఖ మోక్షిత ప్రతిభ కనబర్చింది. ఏపి సబ్ జూనియర్ అండ్ జూనియర్ వింటర్ ఆక్వాటెక్ ఆధ్వర్యంలో ఏలూరు మున్సిపల్ స్విమ్మింగ్ పూల్‌లో ఈ పోటీలు నిర్వహించారు. రెండు వందలు, వంద, యాభై మీటర్లలో బెస్ట్‌స్టోక్ విభాగంలో మోక్షిత మూడు బ్రాంజ్ మెడల్స్ సాధించింది. ఈ మేరకు శ్రీవిష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ స్విమ్మింగ్ కోచ్ సిహెచ్.ఎస్.వర్మ కోచింగ్ వ్యవహరిస్తున్నట్లు తెలిపింది. ఈ నెల 27, 28, 29 తేదీల్లో త్రివేండ్రంలో నిర్వహించే సౌతిజోన్ నేషనల్ స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించింది. ఈ సందర్భంగా తమ కుమార్తెకు సహాయ సహకారాలు అందిస్తున్న శ్రీవిష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ, కాస్మోపాలిటన్ క్లబ్ వారికి ఆమె తండ్రి కోరశిఖ పెద్దిరాజు కృతజ్ఞతలు తెలిపారు.

పతకాలు సాధించిన మోక్షిత

దాతల సహకారాన్ని వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - పాలకోడేరు

విద్యార్థులను ప్రోత్సహిస్తే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని, దాతలందిస్తున్న సహకారాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పాలకోడేరు జెడ్‌పి హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు పి.మహేష్ బాబు అన్నారు. దాతల సహకారంతో పాలకోడేరు జెడ్‌పి హైస్కూల్‌లోని పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ఫీజులు, విద్యా సామగ్రిని మంగళవారం అందించారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ 52 మంది విద్యార్థులకు కొత్తపల్లి రామకృష్ణంరాజు ఆర్థిక సహకారంతో పరీక్ష ఫీజులు, విద్యా సామగ్రిని గాదిరాజు సత్యనారాయణరాజు చేతుల మీదుగా అందించామని తెలిపారు.

మాట్లాడుతున్న ఎంపిడిఒ బి.పూర్ణబాబ్జి

పలు అంశాలపై శిక్షణ

ప్రజాశక్తి - పెనుమంట్ర

గ్రామంలో ఆపద వస్తే ఫ్రంట్ లైన్ వారియర్‌గా పోరాడే బాధ్యత మీపై ఉందని గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శులకు, పంచాయతీ కార్యదర్శులకు ఎంపిడిఒ బి.పూర్ణబాబ్జి సూచించారు. గ్రామ పంచాయతీ డెవలప్‌మెంట్ ప్లాన్ (జిపిడిపి), డెవలప్‌మెంట్ అండ్ పంచాయతీస్ డిపార్ట్‌మెంట్ (డిపిడిపి)లపై స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శులకు, పంచాయతీ కార్యదర్శులకు, డిజిటల్ అసిస్టెంట్లకు, అగ్రికల్చరల్ అసిస్టెంట్లకు, గ్రామ సర్వేయర్లకు, అంగన్‌వాడీ వర్కర్లకు మూడో రోజు శిక్షణ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్ణ బాబ్జి మాట్లాడుతూ గ్రామంలో వనరులు వినియోగించుకోవడమే కాకుండా, గ్రామ ప్రజలకు అన్నింటా చాలా ముఖ్యమన్నారు. కష్టకాలంలో ఫ్రంట్‌లైన్ వారియర్‌గా పోరాడేది మీరేనన్నారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సిడిపిఒ మేరీ ఎలిజబెత్, రవి, సత్యనారాయణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న హరినాయుడు

ఘనంగా హరినాయుడు పుట్టినరోజు వేడుక

ప్రజాశక్తి - ఉండి

తెలుగు యువత ఉండి నియోజకవర్గ అధ్యక్షులు చెన్నంశెట్టి హరినాయుడు పుట్టినరోజు వేడుక టిడిపి మండల అధ్యక్షులు కరిమెరక నాగరాజు అధ్యక్షతన పార్టీ కార్యాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఉండి ఎంఎల్ఎ మంతెన రామరాజు మాట్లాడుతూ తెలుగు యువత అధ్యక్షులు హరినాయుడు భవిష్యత్తులో పార్టీలో మరిన్ని మంచి పదవులను అధిరోహించాలని కోరారు. నియోజకవర్గంలో టిడిపిని బలోపేతం చేయడంలో, యువతను పార్టీ వైపునకు తీసుకురావడంలో హరినాయుడు కీలకపాత్ర పోషిస్తున్నారన్నారు. పార్టీలోని ముఖ్య నాయకుల సమన్వయంతో స్ఫూర్తిదాయకంగా ప్రజలకు ఉపయోగపడే రక్తదాన శిబిరం వంటి మంచి కార్యక్రమాలు చేస్తున్నారన్నారు. అనంతరం కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కన్నెర వెంకన్న, పార్టీ గ్రామ అధ్యక్షులు కాగిత వెంకట సత్యనారాయణ, గ్రామ ప్రధాన కార్యదర్శి బందారు సుబ్బారావు, సీనియర్ నాయకులు కన్నెగంటి రాతేశ్వ, మంతెన సాయి లచ్చిరాజు, కందుల బలరామకృష్ణ, కరిమెరక శ్రీనివాస్, కాగిత మహంకాళి, బురిడి రవిబాబు, వనిమా శ్రీనివాస్, గొల్ల విక్టర్‌బాబు పాల్గొన్నారు.

రెవెన్యూ రికార్డుల స్వచ్ఛీకరణకు 15న గ్రామసభలు

ప్రజాశక్తి - పెనుమంట్ర

క్షేత్రస్థాయిలో రెవెన్యూ రికార్డుల స్వచ్ఛీకరణ కోసం ఈ నెల 15వ తేదీ నుంచి గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ దండు అశోక్‌వర్మ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 15వ తేదీన నెగ్గిపూడి, మార్టేరు, కొయ్యేటిపాడు, సత్యవరం, ఆలమూరు, భట్లమాగుటూరు, ఓడూరు, నెలమూరు, ఆలస్మేరు, పెనుమంట్రలో 16వ తేదీ మామిడూరు, సోమరాజు ఇల్లింద్రపర్రు, పొలమూరు గ్రామపంచాయతీలో జరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్, సర్వేయర్, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, సీనియర్ అసిస్టెంట్ పాల్గొంటారని, ప్రతి గ్రామంలోని కార్యక్రమాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తారని తెలిపారు.

18న 2కె రన్

ప్రజాశక్తి - పాలకొల్లు

ఈ నెల 18 ఆదివారం ఉదయం ధర్మారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవ్ ద గర్ల్ చైల్డ్ 2కె రన్ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో స్థానిక సంస్థలతో పాలకొల్లు లయన్స్ క్లబ్ సమావేశపు హాలులో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఫౌండేషన్ ఛైర్మన్ నిమ్మల రామానాయుడు, పాలకొల్లు లయన్స్ క్లబ్, రోటరీ క్లబ్, వాసవి క్లబ్, కాపు క్లబ్, వార్డ్స్ క్లబ్, మానవతా సంస్థ, రసధుని, నడిచేటం సమాఖ్య వివిధ సేవా దృక్పథ సంస్థల ప్రతినిధులు సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ వేలేరు సమాజంలో మహిళలకు చేయాల్సిన సేవలు ఎన్నో చట్టాలు తెచ్చినా మహిళలపై దాడులు జరుగుతూనే ఉన్నాయన్నారు. సమాజాన్ని చైతన్య పరచాలని ఇటువంటి సదస్సులు అవసరమని చెప్పారు.

నేరాలు - ఘోరాలు

వృద్ధిపై పోక్సో కేసు

తణుకు రూరల్ : బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... వేల్పూరు గ్రామానికి చెందిన ఒక వ్యక్తి బాలాజీ నగర్‌కు చెందిన వర్గీనీడి నరేష్ వద్ద తాపీపని చేస్తూ ఉంటాడు. వీరిద్దరు స్నేహితులు. ఈ క్రమంలో వేల్పూరు గ్రామానికి చెందిన వ్యక్తికి నరేష్ రూ.పది వేలు అప్పుగా ఇచ్చాడు. అప్పు ఇచ్చిన సొమ్ము వసూలు నిమిత్తం రోజూ వారింటికి వెళ్తూ ఉండేవాడు. ఈ క్రమంలో ఈ నెల నాలుగో తేదీన మధ్యాహ్నం సమయంలో ఇంటికి వెళ్లాడు. ఇంట్లో బాలిక తప్ప ఎవరూ లేకపోవడంతో బాలికతో అసభ్యంగా ప్రవర్తించాడు. దీనికి బాలిక ప్రతిఘటించడంతో చెంప మీద కొట్టి వెళ్లిపోయాడు. అనంతరం బాలిక స్థానికులకు ఈ విషయాన్ని చెప్పింది. బాలిక తల్లిదండ్రులు వచ్చాక స్థానికులు జరిగిందంతా చెప్పడంతో బాలిక తల్లి పలుమార్లు చెప్పినా తండ్రి పట్టించుకోకపోవడంతో ఈ నెల 12వ తేదీ రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోక్సో కేసు నమోదు చేసినట్లు తణుకు రూరల్ ఎస్ఐ ఆంజిబాబు తెలిపారు.

ప్రజాశక్తి ప్రతి అక్షరం - ప్రజా పక్షం

పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈ క్రింది నెంబర్లను సంప్రదించండి

ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190

పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

తాగు, సాగు నీరందించేందుకు కృషి

కాళ్ల సర్వసభ్య సమావేశంలో ఎంపిపి శిరీష

సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ శ్రీనివాసరావు

ప్రజాశక్తి - కాళ్ల

తాగు, సాగునీరు అందించేందుకు అధికారులు ప్రజాప్రతినిధులు సమిష్టి కృషి చేయాల్సి ఉందని ఎంపిపి పెన్మెత్స శిరీష అన్నారు. కాళ్ల మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని మంగళవారం ఎంపిపి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో శాఖలవారీగా సమీక్ష నిర్వహించారు. ఆక్వా కాలుష్యం వంట కాలువల్లోకి వస్తుందని, ఆ నీటినే మంచినీటి చెరువుల్లోకి నింపుకుంటున్నామని కోలనపల్లి గ్రామ సర్పంచ్ కొనకంచి సూర్యనారాయణమూర్తి చెప్పారు. మండల వ్యవసాయ అధికారి చామర్తి జయవాసుకి మాట్లాడుతూ మరో రెండు రోజుల్లో తుపాను ఉన్న దృష్ట్యా రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. జవాద్ తుపాన్ ప్రభావం వల్ల కురిసిన వర్షానికి తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టుకోవాలన్నారు. రంగు మారిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ టి.శ్రీనివాసరావు మాట్లాడుతూ పంట కాలువలో స్వచ్ఛమైన నీరు వచ్చినప్పుడే మంచినీటి చెరువులకు నింపుకోవాలని సర్పంచులకు సూచించారు. మండలంలో జలజీవన్ మిషన్ నిధులు మొదటి విడతలో రూ.నాలుగు కోట్ల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. మూడు గ్రామాల్లో పనులు జరుగుతున్నాయన్నారు. జక్కరం గ్రామంలో రూ.18 లక్షలతో ఫిల్టర్ నిర్మాణ పనులు, కోమటిగుంటలో ఫిల్టర్ బెడ్ నిర్మాణ పనులు రూ.38 లక్షలతో, సూర్యారావుపేటలో ఒహెచ్ఎస్ఆర్ నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. కొలనపల్లి గ్రామంలో అదనపు ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణ పనులు రూ.22 లక్షలతో జరుగుతున్నాయన్నారు. రెండో విడతలో జల జీవన్ మిషన్ నిధులు రూ4.50 కోట్ల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. రబీ సాగుకు సాగునీరు సమృద్ధిగా అందించాలని పలువురు సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు కోరారు. ఉండి ఇరిగేషన్ ఫణి శంకర్ మాట్లాడుతూ రబీ సాగుకు ఎటువంటి సాగునీటి ఎద్దడి తలెత్తకుండా గోదావరి నీటితో పాటు సీలేరు జలాలు అందించేందుకు ఇరిగేషన్ శాఖ ప్రణాళికలు సిద్ధం చేసిందన్నారు. ఈ సమావేశంలో జెడ్‌పిటిసి సభ్యులు పచ్చిగోళ్ల సోమేశ్వరరావు, ఎంపిడిఒ జి.స్వాతి, ఆర్‌డబ్ల్యుఎస్ టి శ్రీనివాసరావు, హౌసింగ్ ఎఇ పెన్మెత్స ఆంజనేయరాజు, మండల వ్యవసాయ అధికారి చామర్తి జయవాసుకి, ఎలక్ట్రికల్ ఎఇ పి.రాంబాబు, పంచాయతీరాజ్ ఎఇ రమేష్‌బాబు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ హేమలత, మండల పరిషత్ పర్యవేక్షకులు ఎంఎస్.ప్రభాకరరావు, వైస్ ఎంపిపిలు సరాబు చంద్రావతి, మన్నే నాగలక్ష్మి, మండల కో-ఆప్షన్ సభ్యులు గుర్రం జార్జ్ బెనార్ పాల్గొన్నారు.

స్కూల్ పిల్లలకు బిస్కెట్లు, పండ్లు అందజేత

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం వైఎన్ కళాశాల డాక్టర్ సి.ఎస్.రావు పీజీ సెంటర్‌లో చదువుతున్న ఎంబిఎ విద్యార్థులు వారి స్వీయ ఆర్థిక వనరులతో సామాజిక సేవలో భాగంగా అంధుల పాఠశాలలోని సుమారు 20 మంది పిల్లలకు, బెత్నెస్ లెప్రసీ హాస్పిటల్ స్పెషల్ అప్పర్ ప్రైమరీ స్కూల్‌లోని సుమారు 120 స్కూల్ పిల్లలకు మంగళవారం బిస్కెట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైఎన్.కళాశాల డీన్ డాక్టర్ గంధం రామకృష్ణ మాట్లాడుతూ ఎంబిఎ విద్యార్థులు సామాజిక సేవ చేయడాన్ని బాధ్యతగా తీసుకొని సేవ చేయడం ఆనందదాయకమన్నారు. ప్రస్తుత సమాజంలో విద్యార్థులు చదువుతో పాటు సమాజ సేవ చేయాలనే భావంతోనే సమాజాభివృద్ధి సాధ్యమన్నారు. పిల్లలకు బిస్కెట్లు, పండ్లు అందించిన ఎంబిఎ విద్యార్థులు ఎ.సాయిరామ్, బి.సాయిదుర్గ, ఎస్.భాగ్యసాయి, కె.శ్రీను, ఎం.అజయ బాబు, చింటుబాబులను అంధుల పాఠశాల, బెత్నెస్ లెప్రసీ అప్పర్ ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందించారు.

బిస్కెట్లు, పండ్లు అందిస్తున్న విద్యార్థులు

రైతులు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - ఆకివీడు

మరో మూడు రోజులు వర్షాలు వచ్చే అవకాశం ఉండడంతో రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల స్థాయి ధాన్యం కొనుగోలు అధికారుల కమిటీ సూచించింది. మండలంలోని కోళ్ళపర్రు, రాజులపేట, సిద్ధాపురం, చినమిల్లిపాడు, కాళింగగుండం గ్రామాల్లో తహశీల్దార్ నడు వెంకటేశ్వరరావు, ఇన్‌ఛార్జి ఎండిఒ ఎం.శ్రీకర్, ఎడిఎ కెఎస్ఎస్.శ్రీనివాసరావు, మండల వ్యవసాయ అధికారి ఎంఆర్‌పి ప్రియాంక మంగళవారం పర్యటించారు. మరో మూడు రోజులు వర్షాలు పడే అవకాశం ఉండడంతో రైతులు ముందుగా ధాన్యం జాగ్రత్త చేసుకోవాలన్నారు. విఎఎలు రవితేజ, శిరీష, పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగిస్తున్న జెసిబి

ఆక్రమణల తొలగింపు

ప్రజాశక్తి - ఆకివీడు

మండల కేంద్రం ఆకివీడు పట్టణంలో ఎంతో కాలంగా వేధిస్తోన్న ట్రాఫిక్ సమస్యకు పరిష్కరించేందుకు ఆక్రమణల తొలగింపు కార్యక్రమం ప్రారంభించారు. రోడ్డుకు ఇరువైపులా ఆక్రమ నిర్మాణాలను తొలగింపు పనులు చేపట్టారు. గ్రామానికి తూర్పు భాగంలో ఉన్న గుమ్ములూరు సెంటర్ నుంచి ఈ ఆక్రమణల తొలగింపు పని మంగళవారం అధికారులు ప్రారంభించారు. సుమారు కిలోమీటరు పైబడి మొదటి రోజు పని ముందుకు సాగింది. గ్రామం మొత్తం ఈ ఆక్రమణలు తొలగించి ట్రాఫిక్ అంతరాయం తొలగించే పని పూర్తిగా నిర్వహిస్తామని కమిషనర్ వెంకటేశ్వరరావు చెప్పారు.

విద్యార్థులు చదువుపై శ్రద్ధ పెట్టాలి

ప్రజాశక్తి - పెనుమంట్ర

పదో తరగతి విద్యార్థుల భవిష్యత్తు వారి విద్యాభ్యాసంపై ఆధారపడి ఉంటుందని జిల్లా కెరీర్ గైడెన్స్ కమిటీ చైర్మన్ కె.రాధాకృష్ణపులత అన్నారు. పొలమూరు హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో కెరీర్ గైడెన్స్ అవగాహన మెటీరియల్ పంపిణీ కార్యక్రమం హెచ్ఎం బండి ఆంజనేయులు ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాధాపులత మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు చదువుపై శ్రద్ధ వహించి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచి కదిలింది దినేష్‌రాజు, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ నియోజకవర్గ జిల్లా కమిటీ సభ్యులు కె.సత్యనారాయణమూర్తి, జిల్లా కమిటీ మెంబర్ కర్రి గౌరీసుబ్బారెడ్డి, ట్రెజరర్ మురళి, కార్యదర్శి కోనాల శ్రీనివాసరావు, కన్వీనర్ కర్రి వేణుబాబు, గ్రామ అధ్యక్షులు సుందరరాజు, రామకృష్ణ పాల్గొన్నారు.

అక్రమ భవన నిర్మాణం నిలిపివేయాలని నిరసన

ప్రజాశక్తి - భీమవరం రూరల్

నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న భవన నిర్మాణాన్ని నిలుపుదల చేయాలని డిమాండ్ చేస్తూ రాయ్యాల శ్రీనివాస్ అనే వ్యక్తి మంగళవారం మున్సిపల్ కార్యాలయం గేటు ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. దీంతో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ వద్దకు వచ్చి అక్రమ నిర్మాణాన్ని నిలుపుదల చేస్తున్నామని, చర్యలపై విచారణ చేపడతామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మీడియాతో మాట్లాడుతూ స్థానిక సుంకర పద్దయ్య వీధి ప్రాంతంలో అక్రమ నిర్మాణం జరుగుతుందని మున్సిపల్ అధికారులకు పలుమార్లు విన్నవించినప్పటికీ వారు స్పందించకపోవడంతో తాను మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన తెలిపినట్లు చెప్పారు. అక్రమ నిర్మాణ భవనం నిలుపుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.



మున్సిపల్ కార్యాలయం గేటు ఎదురుగా బైఠాయించిన శ్రీనివాస్

సైన్స్ ప్రదర్శనలతో నైపుణ్యాభివృద్ధి

పాలకోడేరులో...

ప్రజాశక్తి - కాళ్ల

సైన్స్ ప్రదర్శనలో విద్యార్థుల ప్రతిభ నైపుణ్యాలు పెరుగుతాయని భీమవరం డివిజన్ విద్యాశాఖాధికారి డిఐఇఒ డి.శ్రీరామ్ అన్నారు. ఏలూరుపాడు ఉన్నత పాఠశాలలో మంగళవారం మండల స్థాయి సైన్స్ ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. ఐదు విభాగాలకు సంబంధించి తొమ్మిది ఉన్నత పాఠశాలలు, రెండు ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ గాదిరాజు వెంకట రామకృష్ణంరాజు, గ్రామ సర్పంచి భూపతిరాజు వెంకట జగ్గరాజు, ఎంపిటిసి సభ్యులు చిన్నారపు రాంబాబు, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ మంతెన రామకృష్ణంరాజు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ టివి.వరలక్ష్మి, ప్రధానోపాధ్యాయులు అనురాధ, సభ్యులు జి.కనకరాజు, నాగరాజు, రాజబాబు, ప్రసాద్ పాల్గొన్నారు. మండల స్థాయి సైన్స్ ప్రదర్శనలో ప్రథమ స్థానాల్లో నిలిచిన ఐదుగురు విద్యార్థులకు డిఐఇఒ బహుమతులు అందించారు.

పాలకోడేరు : పాలకోడేరు జిల్లా పరిషత్ పాఠశాలలో ఏర్పాటుచేసిన సైన్స్ ఎగ్జిబిషన్‌ను శ్రీ విజ్ఞాన వేదిక నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మంగళవారం ప్రారంభించారు. మండల విద్యాశాఖాధికారి పి.రామలక్ష్మణమూర్తి, జిల్లా సైన్సు అధికారి వివి.ఆర్ శ్యాంప్రసాద్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మహేష్, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు ఎం.శ్రీనివాస్, జి.సుకుమార్ పాల్గొన్నారు. విద్యార్థులందరికి మొక్కలు, విజేతలకు సైన్సు పుస్తకాలు అందించారు.

వీరవాసరం : ఈ నెల 12, 13 తేదీల్లో వీరవాసరం ఎంఆర్‌కె జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నిర్వహించిన మండలస్థాయి సైన్స్ ఫెయిర్‌లో మండలం నుంచి ఐదుగురు విద్యార్థులు ఎంపికైనట్లు మండల స్థాయి సైన్స్ ఆఫీసర్ శ్యాంప్రసాద్ తెలిపారు. మండలంలోని వివిధ పాఠశాలల నుంచి పాల్గొన్న విద్యార్థులకు ఐదు విభాగాల్లో మండల స్థాయి సైన్స్ ఆఫీసర్ పర్యవేక్షణలో ఈ సైన్స్ ఫెయిర్ హైస్కూల్ స్థాయిలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బి.ప్రభామంజరి, సైన్స్ ఉపాధ్యాయులు వై.హేమలత, కె.లక్ష్మీపార్వతి, వివిఎస్.సుబ్రహ్మణ్యం, ఎ.రామలక్ష్మి, ఎన్.కళ్యాణి, శివకుమార్, రవికుమార్, కనకలక్ష్మి పాల్గొన్నారు.

పాలకొల్లు రూరల్ : మండలంలోని లంకలకోడేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి ఉన్నత పాఠశాలల విద్యా వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనలో ఐదు భాగాలుగా విద్యార్థులు 44 ప్రదర్శనలు ప్రదర్శించారు. జిల్లా సైన్స్ ఆఫీసర్ వివిఆర్ శ్యాంప్రసాద్, మండల విద్యాశాఖ అధికారి ఎవిఎన్.ప్రసాద్ ప్రదర్శనలను ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్యాంప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఈ ప్రదర్శనలు ఉపయోగపడతాయన్నారు. విద్యాశాఖ అధికారి ప్రసాద్ మాట్లాడుతూ మండల స్థాయి ప్రదర్శనలు లంకలకోడేరు జిల్లా పరిషత్ స్కూల్లో నిర్వహించడం ఎంతో సంతోషదాయకమన్నారు. అనంతరం బహుమతులు అందించారు. ఐదుగురు విద్యార్థులు జిల్లాస్థాయి ప్రదర్శనకు ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో ఎస్.చిక్కాల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు, చింతపర్రు హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు సిహెచ్.రామారావు, మున్సిపల్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రభాకర్ శాస్త్రి, ఆర్.విష్ణుమూర్తి, యూన్స్ లక్ష్మి, షేక్ పీర్ సాహెబ్ పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలి

ప్రజాశక్తి - మొగల్తూరు

గ్రామ పంచాయతీల సమగ్రాభివృద్ధికి అధికారులు ప్రణాళికలు సిద్ధం చేయాలని జెడ్‌పిటిసి సభ్యులు తిరుమాని బాపూజీ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై మంగళవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సామాజిక, సామాజికతర అంశాలతో పాటు నిధులు అవసరంలేని పనులను గుర్తించి ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. జలజీవన్ మిషన్ ద్వారా అందరికీ ఉచితంగా కుళాయిలు అందించే పనులను గ్రామాల్లో పక్కాగా అమలయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఎంపిడిఒ ఆర్ఎస్ అరుణ్‌కుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టి అమలు చేస్తున్న పథకాలను సచివాలయ సిబ్బంది ప్రణాళిక బద్ధంగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి ఎం.నవీన్ కిరణ్, రేవు రాంబాబు, శిక్షకులు ఐఎన్.రాజు, బూసి రాజు పాల్గొన్నారు.

ఆచంట : పేదరికం లేని సమ సమాజానికి ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని ఎంపిడిఒ వివిఎస్ ఎల్.జగన్నాధరావు అన్నారు. గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలు తయారీపై ఎంపిడిఒ ఆధ్వర్యంలో మంగళవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదరికం లేని మెరుగైన జీవన ఉపాధులు కలిగి ఉండాలన్నారు. స్వయం సమృద్ధితో మౌలిక సదుపాయాలు సామాజిక న్యాయం, సామాజికంగా భద్రత కలిగిన గ్రామాలుగా ఉండాలన్నారు. సుపరిపాలన కలిగిన గ్రామాలుగా అన్ని గ్రామ పంచాయతీలు రూపుదిద్దుకోవడానికి ప్రణాళికలు తయారు చేయడానికి శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పిఆర్ డిప్యూటీ సూర్యకుమార్, ఉపాధ్యాయులు యర్రగోపుల నాగరాజు, తాతం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

17న దళితుల సమరభేరి జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఏలూరు నగరంలో ఈ నెల 17వ తేదీన నిర్వహించే ఉమ్మడి పశ్చిమ గోదావరిజిల్లా దళితుల సమరభేరి ర్యాలీని జయప్రదం చేయాలని టిడిపి జిల్లా అధ్యక్షులు, పార్టీ భీమవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి తోట సీతారామలక్ష్మి పిలుపునిచ్చారు. జిల్లా టిడిపి కార్యాలయంలో టిడిపి ఎస్‌సి సెల్ జిల్లా అధ్యక్షులు చుక్క సాయిబాబు అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో సమరభేరి ర్యాలీ కరపత్రాలను తోట సీతారామలక్ష్మి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాలు, ఆలోచనలకు అనుగుణంగా కీర్తిశేషులు నందమూరి తారక రామారావు స్థాపించిన టిడిపి ఆవిర్భావం నుంచి దళితుల అభ్యున్నతికి సంక్షేమానికి ఎన్నో కార్యక్రమాలు చేపట్టిందని, అదే స్ఫూర్తిని కొనసాగిస్తూ నారా చంద్రబాబు గత ప్రభుత్వ ముఖ్యమంత్రిగా దళితుల కోసం అనేక పథకాలు, అభివృద్ధి పథకాలు తీసుకొచ్చారని చెప్పారు. జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి గతంలో ఉన్న దళిత సంక్షేమ అభివృద్ధి పథకాలను రద్దు చేశారని, దళితులపై దాడులు హత్యలు, అత్యాచారాలు పెరిగిపోయాయని అన్నారు. జగన్ రెడ్డి దళితులంతా ఏకమై పోరాటం చేయాలన్నారు. ఎస్‌సి సెల్ జిల్లా అధ్యక్షులు చుక్క సాయిబాబు మాట్లాడుతూ 17న నిర్వహించే సమరభేరి ర్యాలీని జయప్రదం చేయాలని కోరారు. ఎస్‌సి సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు యేసుపాదం మాట్లాడుతూ దళితులపై జరుగుతున్న దమనకాండను దళితులంతా ఏకమై ఖండించాలన్నారు. ఎస్‌సి సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పీతల శ్రీనాథ్ మాట్లాడుతూ వేలాదిమంది దళితులతో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఏలూరులో నిర్వహించతలపెట్టిన దళితుల సమరభేరి ర్యాలీలో దళితులంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు దండిపాటి రాజు, కోమటంటిలి ప్రభాకర్, సుధీర్‌బాబు, గండికోట నందిరాజు, కొలసు చిట్టిబాబు సురేష్, ఉన్నమట్ల వీర్రాజు, కోళ్ల నాగబాబు, అంగర వెంకటేశ్వరరావు, మిర్తిపాటి గున్నేశ్వరరావు, కె.రామాంజనేయులు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో శాశ్వత భూ సర్వే

ప్రజాశక్తి - పెనుగొండ

మండలంలోని సిద్ధాంతం, ఇలపర్రు, మునమర్రు గ్రామాల్లో జగనన్న శాశ్వత భూమి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ గురుమూర్తి రెడ్డి మాట్లాడుతూ రైతులు, భూ హక్కుదారులు వినియోగించుకోవాలని తెలిపారు.

భూ రీ సర్వేపై గ్రామసభలు

ఉండి : మండలంలోని చెరుకువాడ, అర్తమూరు, కోలమూరు, పాములపర్రు, ఉప్పులూరు, యండగండి గ్రామాల్లో భూ రీ సర్వే కార్యక్రమంపై గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ ఎం.రవీంద్ర కుమార్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రైతులు, గ్రామస్తులు ఈ గ్రామ సభలో పాల్గొని భూ రీ సర్వేపై అవగాహన పెంచుకోవాలని ఆయన సూచించారు.

నేడు ఎంఆర్‌పిఎస్ జిల్లా మహాసభ

ప్రజాశక్తి - ఆచంట

నెల 14వ తేదీ బుధవారం ఆచంట పెద్ద పేట గ్రౌండ్ లో నిర్వహించనున్న ఎంఆర్‌పిఎస్ జిల్లా మహాసభను జయప్రదం చేయాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కో-కన్వీనర్ పసుపులేటి చిన్నబాబు పిలుపునిచ్చారు. ఆచంట సంత మార్కెట్‌లో ఎంఆర్‌పిఎస్ మండల ఇన్‌ఛార్జి దిగమర్తి వెంకటేశ్వరరావు అధ్యక్షతన మంగళవారం సాయంత్రం సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన చిన్నబాబు మాట్లాడుతూ 14న నిర్వహించే మహాసభకు ఎంఆర్‌పిఎస్ జాతీయ అధ్యక్షులు ఎం.నాగరాజు ముఖ్య అతిథిగా పాల్గొంటారని తెలిపారు. మన్నెట్ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు విశాఖలో తీసుకున్న నిర్ణయాలను ఉద్దేశించి 14న నిర్వహించే మహాసభలో ఎంఆర్‌పిఎస్ భవిష్యత్తులో జరగనున్న కార్యచరణ ప్రణాళికను రూపొందించినట్లు ఆయన తెలిపారు. సమావేశానికి నూతన కమిటీలు, అనుబంధ సంఘాల నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌పి జిల్లా వర్కింగ్ కమిటీ అధ్యక్షులు కసాల పెద్దిరాజు, ఆచంట మండల మాజీ అధ్యక్షులు చంటిబాబు, నియోజకవర్గ నాయకులు ఆనంద్, కొడమంచిలి ప్రభాకర్, బాబ్జి, ఉండపల్లి ఏసు పాల్గొన్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుక

ప్రజాశక్తి - ఉండి

యునైటెడ్ పాస్టర్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో మండలంలోని చెరుకువాడ గ్రామంలో చర్చ్ ఆఫ్ క్రైస్ట్ చర్చిలో సెమీ క్రిస్మస్ వేడుకలు స్థానిక పాస్టర్ బి.జోసెఫ్ అధ్యక్షతన మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య ప్రసంగీకులుగా చర్చ్ ఆఫ్ క్రైస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు మేడిది జాన్సన్, డాక్టర్ ఈలి డేవిడ్ మార్క్ హాజరయ్యారు. ముఖ్య అతిథిగా ఉండి ఎంఎల్ఎ మంతెన రామరాజు హాజరై మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఇతరుల పట్ల జాలి, ప్రేమ, కరుణ కలిగి ఉండాలన్నారు. అనంతరం చర్చి కమిటీ ఆధ్వర్యంలో ఎంఎల్ఎ మంతెన రామరాజును, టిడిపి మండల అధ్యక్షులు కరిమెరక నాగరాజును ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో చెరుకువాడ సర్పంచి కొండేటి సాంబశివరావు, అర్తమూరు సర్పంచి గోపతీయని వీర్రాజు, టిడిపి క్లస్టర్ ఇన్‌ఛార్జి కట్టా రాంబాబు, మండల ప్రధాన కార్యదర్శి కన్నెర వెంకన్న, కట్టా నరసింహస్వామి, పాల్గొన్నారు.

పూలపల్లిలో 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి'

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

పాలకొల్లు మండలంలోని పూలపల్లి గ్రామంలో మంగళవారం నిర్వహించిన ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో ఎంఎల్ఎ డాక్టర్ నిమ్మల రామానాయుడు పాల్గొన్నారు. గ్రామంలో కార్యకర్తలతో పాటు పర్యటించి గ్రామస్తుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల ప్రెసిడెంట్ కోడి విజయభాస్కర్, పార్టీ గ్రామ ప్రెసిడెంట్ శ్రీహరి రాజు, గ్రామ సెక్రటరీ జి.ప్రసాద్, గొడవ రామకృష్ణ, గబ్బేడి నరసింహస్వామి, యు.నాగేశ్వరరావు, నాగరాజు పాల్గొన్నారు.

లింక్ డాక్యుమెంట్స్ పోయినవి

నల్లజర్ల మండలం, దూబచర్ల గ్రామానికి చెందిన ఇడపలపాటి లక్ష్మి సురేష్ బాబు, తండ్రి: లక్ష్మినారాయణ, అను నా పొలమునకు సంబంధించిన ఒరిజినల్ లింక్ డాక్యుమెంట్ నెం. 5659, సర్వే నెం.1౨1a గల దాక్యుమెంట్ దూబచర్ల నుండి అంబరుపేట మోటారు సైకిల్‌పై వెళ్తుండగా మార్గ మధ్యలో పడిపోయినవి. దొరికిన వారు ఈ క్రింది అడ్రసుకు అందజేయగలరు.

ఇడపలపాటి లక్ష్మి సురేష్ బాబు
సెల్: 94407 03078

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం - పంచాయితీ రాజ్ శాఖ
గ్రామ పంచాయితీ కార్యాలయము- అమ్మవారి గూడెం
ఆగిరిపల్లి మండలం, ఏలూరు జిల్లా

R.O.C.No. 35/2021 ps-V — Dt.12-12-2022

బహిరంగ వేలము ప్రకటన

ఆగిరిపల్లి మండలం, అమ్మవారిగూడెం గ్రామ పంచాయితీ పరిధిలోని ఈ దిగువ సదహరించిన షెడ్యూలు దాఖలు ఐటమ్సు బహిరంగ వేలం నిర్వహించుటకు పై అధికారుల ఉత్తర్వుల ననుసరించి ది.21.12.2022వ తేది బుధవారం సాయంత్రం 04.00 గం॥ కు అమ్మవారిగూడెం గ్రామ పంచాయితీ కార్యాలయము వద్ద సదరు పంచాయితీ కార్యదర్శి గారిచే గాని లేక వారి అనుమతి పొందిన వారిచే గాని బహిరంగ వేలం నిర్వహించబడును. బహిరంగ వేలము నందు పాల్గొనదలచిన వారు సంబంధిత ఐటమ్సుకు గాను వేలం పాటకు ముందుగా రూ. 10,000/- (అక్షరాల పది వేలు రూపాయలు మాత్రమే) లకు ఏదైనా జాతీయ బ్యాంకు నందు తీసిన డి.డి. సమర్పించి వేలంలో పాల్గొనవలెను. షెడ్యూల్ నందు తెలిపిన ధరావత్తు చెల్లించిన హెచ్చు పాట మొత్తం ఆ పై మొత్తంలో అదే రోజు చెల్లించని యెడల ధరావత్తు జప్తు చేయబడును. వేలం షరతులు మరియు ఇతర వివరములు కార్యాలయము పనివేళల యందు తెలుసుకొనవచ్చును.

వరుస నెం.	ఐటమ్ వివరము	చెల్లించవలసిన ధరావత్తు	పాట కాలపరిమితి
1	ఊర చెరువు	10000	2022-2025

సం/- బి.ప్రసాద్, పంచాయితీ కార్యదర్శి, అమ్మవారి గూడెం

సం/- జలసూతం కొండలరావు, సర్పంచ్